
B. Venkat Rao



# హోటల్లో ఓ రాత్రి

నొచ్చుకుంటున్నట్టు భుజాలెగరేసి "మా దగ్గర ఖాళీగా వున్నదదే" అన్నాడు నైట్ రిసెప్షనిస్టు.

"రాత్రి ఇంతపొద్దుపోయాక మీకు సింగిల్‌రూమ్ ఎక్కడా దొరకదు. అయితే ఇతర హోటళ్లలో ప్రయత్నించి చూడాలనుకుంటే అది మీ ఇష్టం. ఇంకా కాసేపు పోయాక మళ్లీ తిరిగొస్తే, ప్రస్తుతానికి ఆ డబుల్ రూమ్‌లో ఖాళీగావున్న బెడ్ కూడా మీకు దొరక్కపోవచ్చు"

"మంచిది- ఆ బెడ్ తీసుకుంటాను. అయితే నా స్థితి అర్థం చేసుకొని వుంటారని అనుకుంటున్నాను. నేను భయపడుతున్నానని కాదు. నిజానికి భయపడ్డానికి కారణం కూడా లేదు. ఒక రాత్రల్లా అతనితో గడపవలసిన వ్యక్తిని సహచరుడు అనడం అసమంజసం కాదనుకుంటాను. నా సహచరుడు గదిలో వున్నాడా?"

"ఉన్నాడు- బహశా ఈ పాటికి అతను నిద్రపోతూ వుండవచ్చు"

శ్యామ్ రిజిస్ట్రేషన్ పేపర్లని రిసెప్షనిస్ట్‌కి అందచేసి, మేడ మెట్లెక్కడం ప్రారంభించాడు. తనకిచ్చిన గది దగ్గరవుతుంటే, అసంకల్పితంగానే శ్యామ్ నడక వేగం తగ్గింది. ఊపిరి బిగబట్టి విన్నాడు- లోపలున్న అపరిచితవ్యక్తి చేసే శబ్దాలు ఏమన్నా వినిపిస్తాయేమోనని. కాస్త వంగి తాళం చెవి రంధ్రంలోంచి లోపలికి చూశాడు కూడాను- కాని గదంతా చీకటిగా వుంది.

శ్యామ్ తలుపు హేండిల్‌ని తిప్పి, లోపలికి ప్రవేశించి మళ్లీ తలుపు మూశాడు. లైట్ స్విచ్ కోసం చీకట్లో తడుముతూ వుంటే, "ఆగండి, దీపం వెయ్యొద్దు. గదిని చీకటిగానే వుంచగలిగితే నాకు మేలు చేసిన వాళ్లవుతారు" అన్నమాటలు గంభీరమైన గొంతుకలో వినిపించాయి.

క్షణకాలం నిశ్చేష్టుడైపోయి నిలబడ్డాడు శ్యామ్.

ఆశ్చర్యాన్ని ధ్వనిస్తూ "మీరు నాకోసం ఎదురు చూస్తున్నారా?" అనడిగాడు.

సమాధానం ఇవ్వలేదు గదిలో వున్న అపరిచిత వ్యక్తి.

"నా సూటుకేస్ మీదగాని, నా వూతకర్రల (Crutches) మీదగాని పడిపోకుండా జాగ్రత్తగా రండి. అవెక్కడో గదిమధ్యన వుండి వుంటాయి. మీ మంచం దగ్గరకి చేరుకోవడానికి గోడ వెంబడ్నే మూడడుగులు వెయ్యండి. ఆ తరవాత ఎడం పక్కకితిరిగి మరోమూడడుగులు వెయ్యండి- మీకు మంచం చేతికి తగుల్తుంది."

అతను చెప్పినట్టే చేసి, సుళువుగా మంచం దగ్గరకి చేరుకున్నాడు శ్యామ్.

బట్టలు మార్చుకుని, పక్కమీదికి చేరి దుప్పటినిండా లాక్కున్నాడు. పక్క మంచంమీది వ్యక్తి వూపిరిపీలుస్తున్న తీరును గమనించి అతగాడు ఇంతలో నిద్రలోకి జారుకునే పరిస్థితి లేదని గ్రహించాడు.

"నా పేరు శ్యామ్" అన్నాడు కాస్త తటపటాయిస్తూనే.

"అలాగా?" అన్నాడు ఆ వ్యక్తి. "ఏదేనా సమావేశానికి హాజరుకావాలని వచ్చారా?"

"అబ్బే, అలాటిదేంకాదు. వూహించడానిక్కూడా చాలా అబ్బురం అనిపించే ఓ పని మీద ఈవూరు వచ్చాను" అన్నాడు శ్యామ్.

దగ్గర్లోనే వున్న రైల్వేస్టేషన్‌లో ఏదో ట్రెన్ ట్రాక్ మారినట్టుంది. భూమి, వాళ్ళు పడుకున్న మంచాలు కంపించినట్టనిపించింది.

తను చెప్పాలనుకుంటున్న సంగతిని సరదాగా, తేలిగ్గా చెప్తున్నట్టుగా వుండాలని శ్యామ్ ప్రయత్నం. అయినా ఎందుకనో కాస్త తటపటాయింపు వ్యక్తమవుతూనేవుంది అతని మాటల్లో.

"నాకో చిన్న కొడుకున్నాడు- ఉత్త అల్లరి వెధవ. వాడికోసమే నేను ఈ వూరు వచ్చాను. వాడిది బాగా సున్నితమైన స్వభావం. తాకితేనే ముడుచుకునే మిమోసా

**ఆంగ్లమూలం: సీగ్‌ఫ్రీడ్ లెన్జ్**
**తెలుగుసేత: ఎ.వి. రెడ్డిశాస్త్రి**

(Mimosa) మొక్కలాంటివాడు. అతి చిన్న విషయాలకి కూడా బాగా చలించిపోతాడు. గాజుతో తయారైనట్లు- వాడి మనసు మరీ సున్నితంగా వుంటుంది- తిక్క వెధవకి! ప్రతిరోజూ పొద్దున్న వాడు స్కూలుకి వెళ్ళేటప్పుడు రైల్వే లెవెల్ క్రాసింగు దగ్గర ఆగాలి. ఆటైముకి ఎర్లీ మోర్నింగ్ ట్రయిన్ పాసవుతూ వుంటుంది గనక. వీడు గేటు దగ్గర నిలబడి- చిన్న వెధవ కదా మరి- చెయ్యి వూపుతూ వుంటాడు రైల్లో ప్రయాణిస్తున్న వాళ్లని చూసి. చాలా ఉద్రేకంగా, ఆత్రంగా, ఎంతో ఆశతో చెయ్యి వూపుతుంటాడు"

"అలాగా? ఆ తర్వాత?"

"తరువాత స్కూలుకి వెళతాడు" అన్నాడు శ్యామ్.

"అయితే స్కూలునుండి తిరిగొచ్చేక వాడు తీవ్రమైన బాధలో వున్నట్లు ప్రవర్తిస్తాడు. ఒక్కోసారి వెక్కివెక్కి ఏడుస్తుంటాడు కూడాను. హోమ్‌వర్క్ చెయ్యడు. ఎవరితోనూ మాట్లాడ్డు. ఎక్కడికీ ఆడుకోవడానికి వెళ్ళడు. ఈ రకమైన తతంగం కొన్ని నెలలుగాసాగుతోంది ప్రతిరోజూ. దీని ఫలితంగా బాగా జబ్బు పడ్డవాడిలా అయిపోయాడు"

"అలా ప్రవర్తించడానికి కారణం ఏమిటట?"

"చూడండి- నేను చెపుతున్నది మీకు బహుశా వింతగా అనిపించవచ్చు. కుర్రాడు చెయ్యి వూపుతాడు, బాధపడవలసిందేమిటంటే, ప్రయాణీకుల్లో ఒక్కడు కూడా వాడి ఉత్సాహానికి స్పందన కనపరిచి, తిరిగి చెయ్యి వూపడంలేదు. ప్రయాణీకులు కనపరుస్తున్న ఈ పట్టించుకోని ధోరణి వాడి మనస్సుని ఎంతలా కలచివేస్తోందంటే- నేను, నా భార్యా వాడి గురించి బెంగపెట్టుకున్నాం"

"అందుకని - మీ కుర్రవాడి మనస్సుకి ఊరట కలిగించడానికి మీరే స్వయంగా పొద్దున్న బయలుదేరే రైల్లో ప్రయాణం చేసి వాడికి చెయ్యి వూపాలని మీ వుద్దేశం- అంతేనా?"

"అంతే, అంతే!" అని బదులిచ్చాడు శ్యామ్.

"పిల్లల గురించి నేనంత పెద్దగా ఏమీ పట్టించుకోను" అన్నాడు అపరిచిత వ్యక్తి.

"నిజానికి పిల్లలంటే నాకు ద్వేషం కూడాను. నా ద్వేషానికి ఉన్నతమైన కారణాన్ని చెప్పాలని నాఉద్దేశం కాదు- అయితే పిల్లల మూలంగానే నా భార్య చనిపోయింది"

"అయ్యో పాపం- నాకు చాలా విచారంగా వుంది" అని సానుభూతిని ప్రకటిస్తూ లేచి కూర్చున్నాడు శ్యామ్.

అపరిచితవ్యక్తి "మీరు కుర్జ్‌బాక్ ట్రెన్‌ని అందుకోవాలని అనుకుంటున్నారు-అంతేనా?" అనడిగాడు.

శ్యామ్ తలగడమీదకు తలను చేర్చి దుప్పటి నిండా కప్పుకుని కొద్దిపాటి ఆలోచన అనంతరం నిద్రలోకి జారుకున్నాడు.

మర్నాడు పొద్దున్న అతను మేల్కొన్నప్పటికి గదిలో తనొక్కడే వున్నట్టు గ్రహించాడు శ్యామ్. వాచీ చూసుకుని గతుక్కుమన్నాడు. తను పట్టుకోవాలనుకున్న రైలు బయలుదేరడానికి కేవలం అయిదు నిముషాల వ్యవధి మాత్రమే ఉంది. అంచేత ఆ బండిని అందుకోవడానికి ఏమాత్రం అవకాశంలేదు.

మరో రాత్రి పట్నంలో గడపడానికి తగిన ఆర్థిక పరిస్థితి అతనికి లేకపోవడంతో, మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చాడు శ్యామ్ ఎంతోదిగులుగా, నిస్పృహగా.


అయితే అతని కొడుకు మహ ఆనందంతో వురకలు వేస్తూ వీధి గుమ్మం దగ్గరే వచ్చి మీదపడ్డాడు.

తండ్రిని అమాంతం వాటేసుకొని, పిడికిళ్లతో అతని వీపుమీద పొడుస్తూ, పెద్ద గొంతుకతో "ఇవాళ ఓ వ్యక్తి నాకు చెయ్యి వూపాడు. ఎంతసేపు వూపాడో తెలుసా?" అన్నాడు.

"క్రచెస్‌తో వున్న వ్యక్తేనా?"

"అవును- నీకెలా తెలుసు? అతని చేతిలో బెత్తం కూడా వుంది. ఉపగలిగినంతసేపు చెయ్యివూపి, ఆ తర్వాత ఓ రుమాలు బెత్తానికి కట్టి కిటికీలోంచి వూపుతూ పట్టుకున్నాడు. నాకు కనిపిస్తున్నంతసేపు అతనా బెత్తాన్ని అలాగే పట్టుకున్నాడు'.

**బహుమతి**



"ఒరేయ్ బాలాజి పదివందల ఎంట్రీలలో నీకు బహుమతి రావడం చాలా అదృష్టం"

"ఐదువందల ఎంట్రీలు నేనొక్కడినే పంపాగా!"

- కిరణ్, తిరుపతి